చిరుతల దాడులు రైతుల్లో గుబులు

అటవీప్రాంతంలో తాగు నీరు లభించక బోర్ల వద్దకు వస్తున్న వైనం

రామాయంపేట(మెదక్): కొన్నేళ్లుగా ప్రశాంతంగా ఉన్న రైతులను చిరుత దాడులు మళ్లీ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వేసవి కాలం వచ్చిందంటే చాలు రైతుల్లో ఆందోళన ప్రారంభమవుతుంది. గతంలో వందలాది పశువులను హతమార్చిన చిరుత దాడులు రెండు, మూడేళ్లుగా తగ్గుముఖం పట్టగా, ఇటీవల మళ్లీ మొదలయ్యాయి. తాజాగా రెండు రోజుల క్రితం రామాయంపేట పట్టణ శివారులో అడవి జంతువుల దాడిలో దూడ మృతి చెందగా, లక్ష్మాపూర్ వద్ద చిరుత దాడిలో ఒక లేగ దూడ హతమైంది. దీనితో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



లక్ష్మాపూర్‌వద్ద చిరుత దాడిలో హతమైన లేగ దూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

పశువులు, రైతులపై కూడా..

రామాయంపేట మండల పరిధిలోని అక్కన్నపేట, తొనిగండ్ల, కాట్రియాల, దంతేపల్లి, పర్వతాపూర్ గ్రామాల పరిధిలో దట్టమైన అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఈ అటవీ ప్రాంతంలో కనీసం ఐదు వరకు చిరుతలున్నాయి. వేసవి కాలంలో వన్యప్రాణులకు అటవీప్రాంతంలో తాగునీరు లభించకపోవడంతో అవి గ్రామాల్లోకి వ్యవసాయ బోర్లవద్దకు వస్తూ అక్కడ ఉన్న పశువులపై దాడులకు పాల్పడుతున్నాయి.

గతంలో పెద్ద సంఖ్యలో పశువులను హతమార్చిన చిరుతల దాటికి రైతులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. చిరుతలు పశువులతో పాటు రైతులపై కూడా దాడులకు పాల్పడ్డ సంఘటనలున్నాయి. మండల పరిధిలోని తొనిగండ్ల, కాట్రియాల, ఝాన్సిలింగాపూర్, పర్వతాపూర్ గ్రామాలు, తండా పరిధిలో గతంలో చిరుత దాడులు ఎక్కువగా నమోదయ్యాయి. అటవీ శాఖ ఉన్నతాధికారులు పలుమార్లు ఈ గ్రామాలను సందర్శించి బాధిత రైతులను పరామర్శించారు. చిరుత దాడులు ఒక్కసారిగా పెరిగిపోవడంతో గతంలో అటవీశాఖ అధికారులు, వాచర్లు, రైతులతో కలిసి రాత్రివేళలో అడవిలో గస్తీ కాసేవారు. చిరుత దాడులు ప్రారంభం కావడంతో రైతులు రాత్రివేళల్లో వ్యవసాయ బోర్లవద్దకు వెళ్లడానికి జంకుతున్నారు. గతంలో బోర్ల వద్ద పంటచేలు కాపలాకు వెళ్లిన రైతులపై చిరుతల దాడులు చేసిన సంఘటనలున్నాయి. ఒకరిద్దరు రైతులు ఒంటరిగా రాత్రి వేళ వెళ్లొద్దని, కనీసం ఐదారుగురు కలిసి వెళ్లాలని అటవీ శాఖ అధికారులు సూచిస్తున్నారు.



అటవీప్రాంతంలో రాత్రివేళ గస్తీ కాస్తున్న అటవీశాఖ అధికారులు, వాచర్లు

దాడులను అరికట్టాలి



గతంలో చిరుతల దాడులతో మేము నష్టపోయాం. ఎప్పుడు దాడులకు పాల్పడుతాయోనని జీవిస్తున్నాం. రెండేళ్లుగా చిరుత దాడులు తగ్గినా.. ఇటీవల మళ్లీ ప్రారంభమయ్యాయి. రాత్రివేళల్లో వ్యవసాయ బోర్లవద్దకు వెళ్లడానికి భయాందోళన చెందుతున్నాం. అధికారులు స్పందించి దాడులను అరికట్టాలి.

– తిరుపతి, సదాశివనగర్ తండా వాసుడు

రైతులు ఒంటరిగా వెళ్లొద్దు



వేసవిలో చిరుతలు తాగునీటి కోసం బోర్లవద్దకు వచ్చే అవకాశం ఉంది. దీంతో రైతులు ఒంటరిగా బోర్లవద్దకు వెళ్లొద్దు. కనీసం ఐదారుగురు కలిసి కర్రలు పట్టుకొని చప్పుడు చేసుకుంటూ వెళ్లాలి. రైతులు తమ పశువులను రాత్రివేళ అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండే వ్యవసాయ క్షేత్రాల వద్ద ఉంచకూడదు.

– విద్యాసాగర్, రేంజ్ అధికారి, రామాయంపేట

సైబర్‌క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహన

రామాయంపేట ఎస్‌ఐ బాల్‌రాజ్

రామాయంపేట(మెదక్): ఎవరైనా ఆకతాయిలు అమ్మాయిలను వేధింపులకు గురిచేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని ఎస్‌ఐ బాల్‌రాజ్ సూచించారు. శుక్రవారం స్థానిక మంజీరా కాలేజీలో షీం టీం విషయమై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యంగా సెల్‌ఫోన్ల విషయమై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని నెంబర్లతో ఫోన్లు వస్తే లిఫ్ట్ చేయొద్దన్నారు. సైబర్ క్రైం విషయమై విద్యార్థులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించుకోవాలని తెలిపారు. చట్టాలు, షీం విధి, విధానాల విషయమై షీం టీం ప్రతినిధులు స్వరూపరాణి, గంగమణి చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో చేసే ఫోన్ నంబర్లను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ బాల్‌రాజ్

సమస్యల పరిష్కారం బీజేపీతోనే సాధ్యం

మెదక్ పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి రాములు

శివ్వంపేట(నర్సాపూర్): ఉపాధ్యాయులు ఎదుర్కొట్టున్న సమస్యలను పరిష్కరించడం బీజేపీతోనే సాధ్యమని మెదక్ ఉపాధ్యాయ బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం శివ్వంపేటతో పాటు పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యను గెలిపిస్తే ఉద్యోగుల కోసం ఉమ్మడి 10 జిల్లాలో సబ్‌జోన్ ఏర్పాటు చేసి, స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెట్ హోదా కల్పిస్తామన్నారు. మెదక్‌ను సిరిసిల్ల జోన్‌లో కలపడంతో ఇక్కడి ఉద్యోగులు, నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందన్నారు. మెదక్‌ను చార్మినార్ జోన్‌లోకి చేర్చేంత వరకు కృషి చేస్తామన్నారు. గత ఎమ్మెల్సీలు ఉద్యోగుల సమస్యలుపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. ఉద్యోగుల క్షేమం కోసం అనుక్షణం ఆలోచించే బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండల్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాములు

వైభవంగా నల్లపోచమ్మకు బోనాలు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రాంపూర్ గ్రామంలో పెద్దమ్మ ఆలయ నాల్గవ వార్షికోత్సవాలు రెండు రోజుల నుంచి కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గ్రామంలో నల్లపోచమ్మకు భక్తులు బోనాల ఊరేగించారు. అనంతరం అమ్మవారికి వాటిని సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



బోనాల ఊరేగింపు

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పరిధిలోని కాళ్లకల్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కొండాపూర్, కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి, కూచారం పరిశ్రమలవాడలో విద్యుత్ ప్రసారం ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకు అంతరాయం ఉంటుందని అందరూ సహకరించాలని కోరారు.

నేటి నుంచి మల్లేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



తూప్రాన్: మండలంలోని మల్కాపూర్‌లో నూతనంగా నిర్మించిన శివాలయంలో దుర్గా మల్లేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో శనివారం ఉదయం 8గంటలకు గురువందనం, వేదస్వస్తి, గోపూజ, గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, 16న ఉదయం 8 గంటలకు వేదస్వస్తి, ప్రాతకాల అర్చనలు, మూల మంత్ర జపం, హోమాలు, 17న గణపతిపూజ, శ్రీజగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధీశ్వరులు అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామి వారితో యంత్రప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

రామాయంపేట(మెదక్): మండలంలోని కోనాపూర్ ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్ సిద్ధరాంలుపై దాడి సంఘటనలో అదే గ్రామానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదైంది. సిద్ధరాంలుపై అదే గ్రామానికి చెందిన అంజయ్య, అతని కుమారులు మహేశ్, నరేందర్ దాడికి పాల్పడ్డారని ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

క్లుప్తంగా

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించండి



మాట్లాడుతున్న ఎస్‌ఐ నారాయణగౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని గ్రామస్తులను ఎస్‌ఐ నారాయణగౌడ్ కోరారు. దీంతో కొర్విపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకొచ్చారు. శుక్రవారం ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కొర్విపల్లి గ్రామస్తులు డబ్బులు జమచేసి సీసీ కెమెరాలనే ఏర్పాటుకు సహకరించనున్నట్లు తెలిపారు. గ్రామంలో 13 సీసీ కెమెరాలు, తండాలో 3 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు రామచంద్రం, మల్లేశం, ఉదయ్ ఉన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



వివరాలు సేకరిస్తున్న ఏఎస్‌ఐ సాధాత్‌మియా

వెల్దుర్తి(తూప్రాన్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి విలువైన కాపర్‌ను అపహరించిన ఘటన మండల కేంద్రం వెల్దుర్తి శివారులో చోటు చేసుకుంది. ఈ సంఘటన స్థలాన్ని ఏఎస్‌ఐ సదాత్‌మియా సందర్శించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెల్దుర్తి గ్రామ శివారులో అనసూయ వ్యవసాయ పొలం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌తో పాటు విలువైన సామగ్రిని అపహరించారన్నారు. దీంతోకేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

బహుమతుల ప్రదానం



బహుమతులతో విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని జామియా మజిద్‌లో షబ్ ఎ బరాత్‌ను నిర్వహించారు. అరబీ చదువుతున్న విద్యార్థులను మజిద్ కమిటీ సభ్యులు చిన్నారులను బహుమతులు అందించారు. కార్యక్రమంలో మజిద్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చాంద్ ఖురేషి, రబ్బానీ, ఉపాధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, యూసుఫ్, సలీమ్ షేక్, సాదఖ్, గౌస్, బాఖర్ పాషా, ఫరీద్, జమీర్, ఏజాజ్ పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సెహగల్ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని రాంపూర్ గ్రామంలో సెహల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా రైతులకు మొక్కజొన్న పంటపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాంలీడ్ వాణి మాట్లాడుతూ.. మొక్కజొన్న పంటలను బోదె పద్ధతిలో సాగు, సమగ్ర సూక్ష్మపోషక నిర్వహణ, తెగులు, కలుపు నివారణ పద్ధతులు తెలిపారు. మొక్కజొన్న సాగుతో కలిగే లాభాలను మార్కెటింగ్ ధరలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు విజయ్, శ్రవణ్, బాబుతో పాటు మహిళా రైతులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఎస్సీ కమ్యూనిటీ భవనం



రాజిపేటలో కమ్యూనిటీ భవనం దుస్థితి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజిపేటలో నిధులు లేక ఎస్సీ కమ్యూనిటీ భవనం అసంపూర్తిగా ఉంది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి రూ. 5 లక్షలతో కమ్యూనిటీ భవనం మంజూరు కావడంతో స్లాబ్ వరకు పనులు చేశారు. నిధులు లేకపోవడంతో ఆరేళ్లగా అసంపూర్తిగానే ఉంది. అధికారులు స్పందించి భవనం పూర్తి కావడానికి నిధులు మంజూరు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి

ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ రూరల్: స్థానిక కళాకారులను ప్రోత్సహించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రజలకు సూచించారు. శుక్రవారం నర్సాపూర్ మండలం మహ్మదాబాద్‌కు చెందిన స్థానిక కళాకారుడు నీరుడి శ్రీశైలం రచించి, రుపొందించిన రాధమ్మ అనే ఫోక్ సాంగ్ ప్రోమోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాధమ్మ అనే ఫోక్ సాంగ్‌ను నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు ఆదరించాలన్నారు. రానున్న రోజుల్లో శ్రీశైలం మరిన్ని పాటలు రాసి అభివృద్ధి చెందాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భవ్య నాయక్, శేఖర్, సూరారం నర్సింహులు వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.



ప్రోమోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

పీఏసీఎస్ చైర్మన్ క్షమాపణ చెప్పాలి

• కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్

టేక్మాల్(మెదక్): రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అవినీతికి పాల్పడిన పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్ రెడ్డి రైతులకు వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన అవినీతిపై ఉన్నతాధికారుల విచారణలో రూ.21,34,933లు అవినీతి జరిగినట్లు తేలడంతో దీనికి బాధ్యులైన సొసైటీ చైర్మన్, సీఈఓ వేణుగోపాల్ తక్షణమే రాజీనామా చేసి, కాజేసిన సొమ్మును వడ్డీతో సహా సహకార సంఘానికి చెల్లించాలన్నారు. ఆరుగాలం కష్టపడి సంపాదించిన రైతుల సొమ్మును అభివృద్ధి పేరుతో దోచుకున్నారని మండిపడ్డారు. జరిగినట్లు రుజువైన పక్షంలో ముక్కు నేలకు రాస్తానని గతంలో చైర్మన్ చేసిన సవాల్‌కు కట్టుబడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాన్ కిషన్, యూసూఫ్, సొసైటీ డైరెక్టర్లు పాపయ్య, నరసింహరెడ్డి, సత్యం, శ్రీరాములు, నరేందర్, మంగమ్మ, కిష్టయ్య, లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు మజార్, కిషోర్, శ్రీధర్ చారి, భూమ్ రెడ్డి, అశోక్ రెడ్డి, విద్యాసాగర్, రాజేశ్‌గౌడ్, శివగౌడ్, సాయి శేషు, మల్లేశంతో పాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఐఎఫ్‌పీ బోధన చాలా బాగుంది

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థ అభివృద్ధికి తీసుకొచ్చిన ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్)ని వినియోగించి బోధించే విధానం చాలా బాగుందని మండల విద్యాధికారి విఠల్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆదేశాలతో సరోజినీ నాయుడు జయంతి పురస్కరించుకొని సోమక్కపేట్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆంగ్ల భాష దినోత్సవానికి ఎంఈఓ విఠల్ హాజరై, ఆంగ్ల ఉపాధ్యాయురాలు సుధారాణిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐఎఫ్‌పీ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించి, సులభ పద్ధతిలో బోధించడం, విద్యార్థులు సైతం వినడంతో పాటు చూసి నేర్చుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. అదేవిధంగా పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున మొబైల్స్, టీవీలకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ చూపించి, ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది అజయ్‌కుమార్, మహేశ్, యాదగౌడ్, మోహన్, విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.



సోమక్కపేట్‌లో ఉపాధ్యాయురాలు సుధారాణిని సన్మానిస్తున్న ఎంఈఓ విఠల్

ఆయిల్‌పామ్ సాగుకు ముందుకురండి

నర్సాపూర్ రూరల్: ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని నర్సాపూర్ మండల వ్యవసాయ అధికారి దీపిక కోరారు. శుక్రవారం మండలంలోని తుజల్ పూర్‌లో సాగు అవుతున్న ఆయిల్ పామ్ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు కోసం ప్రభుత్వం ఎకరాకు రూ. 4200 రాయితీ కల్పిస్తుందన్నారు. దీంతో పాటు 30 నుంచి 40 ఏళ్ల పాటు పంట ప్రభుత్వం పర్యవేక్షణ చేయిస్తుందన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని రైతులకు సూచించారు.



తూజాల్‌పూర్‌లో ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న దీపిక

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



చల్మెడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



అల్లాదుర్గం బాలుర జెడ్పీ పాఠశాలలో..

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి అన్ని తరగతుల్లో విద్యార్థులకు పాఠాలు బోధించారు. వీరిలో హెచ్‌ఎంగా ప్రేమ్ కుమార్, ఎంఈఓగా రిషిక, డీఈఓగా భరత్ తేజ, ఉపాధ్యాయులుగా అనూష, శరణ్య, నవనీత, చరణ్, నితీష్, రంజిత్, పీఈటీలుగా రుత్విక్, శ్రీవర్ధన్ తమ విధులను నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సతీష్ కుమార్, ఉపాధ్యాయులు మోహన్, మమత, జ్యోతిలక్ష్మి, నవీన్ రత్నాకర్, మమత తదితరులు పాల్గొన్నారు.

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం స్వయంపరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. టెన్త్ విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించి, తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ ధనుంజయ్య మాట్లాడుతూ.. పరీక్షలు దగ్గర పడుతున్నాయని, కష్టపడి చదివి పది జీపీఏ సాధించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ హనుమాన్ పూజలు ప్రారంభం



పాపన్నపేట(మెదక్): హనుమాన్ విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వేద బ్రహ్మణులు గణపతిపూజ, స్వస్తి వాచనం, రక్షాబంధనం, పంచగవ్య విధి, అంకురార్పణం, గౌరీమాతృకా పూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహ మండల పూజ, ప్రదోష పూజ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు.

◆ ఘనంగా సేవాలాల్ జయంతి ర్యాలీ

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో శుక్రవారం సేవాలాల్ జయంతి ర్యాలీ ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తండాలకు చెందిన గిరిజన పెద్దలు చేగుంటలోని బస్టాండ్ నుంచి దుర్గామాత ఆలయం వరకు ర్యాలీ నిర్వహించి, ప్రత్యేక పూజలను చేశారు. ఈ కార్యక్రమాల్లో పలు తండాల పెద్దలు, నాయకులు, గిరిజన మహిళలు పాల్గొన్నారు.



◆ శివనామస్మరణతో మార్మోగిన కోనాపూర్

కొల్చారం(నర్సాపూర్): మహాశివరాత్రి శివ స్వాముల దీక్షలో భాగంగా మండలంలోని కోనాపూర్ గ్రామంలో శివమహా పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక హనుమాన్ మందిర్ ఆవరణలో గురు స్వామి మల్లేశం ఆధ్వర్యంలో పార్వతీ సమేత మహాశివుని విగ్రహానికి మంజీరా జలాలు, పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు.

◆ ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడండి

నర్సాపూర్ రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేసే ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆర్డీఓ మహిపాల్ పోలింగ్ కేంద్రాల సిబ్బందికి సూచించారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.

◆ అంతర్గత మార్కులను నివేదించాలి

శివ్వంపేట(నర్సాపూర్): పదో తరగతి విద్యార్థులకు సంబంధించి అంతర్గత మార్కులను పూర్తిస్థాయిలో విశ్లేషించి, నివేదించాలని ఎంఈఓ బుచ్చనాయక్ అన్నారు. శుక్రవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఉన్న 10 ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా వసతిగృహంలో 10వ తరగతిలో 512 విద్యార్థులు చదువుతున్నారన్నారు. ప్రతీ విద్యార్థికి సంబంధించి నాలుగు ఫార్మెట్ అసెస్మెంట్ ఆధారంగా 20 అంతర్గత మార్కులు ఎంట్రీ చేసి సోమవారం వరకు నివేదించాలని సూచించారు. అందుకు సంబంధించి రెండు టీంలు ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రతీ విద్యార్థి అంతర్గత మార్కులు డీఈఓ కార్యాలయానికి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

